క్లుప్తంగా

కన్నాకు కోడెల సెగ !

ముప్పాళ్ళ: మాజీ మంత్రి, సత్తెనపల్లి టీడీపీ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణకు మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు తనయుడు, టీడీపీ నాయకుడు కోడెల శివరామ్ రూపంలో అసమ్మతి సెగ వెంటాడుతోంది. మండలంలోని ఇరుకుపాలెం శివారు గ్రామమైన రామకృష్ణాపురంలో మంగళవారం రాత్రి జరిగిన ఇంటింటికీ కోడెల, కోడెల శివప్రసాదరావు విగ్రహావిష్కరణ కార్యక్రమం సందర్భంగా కోడెల శివరామ్ మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణపై పరోక్ష విమర్శలకు దిగారు. సత్తెనపల్లి నాదే అంటూ ప్రచారం చేసుకుంటున్న వ్యక్తి పక్కన ఉన్న వారంతా కాంట్రాక్టర్లు, బ్రోకర్లు, లోఫర్‌లు, జోకర్‌లు తప్ప నిజమైన కార్యకర్తలు లేరన్నారు. పార్టీ మారటంలో అతను సీనియర్ మరిదేంట్లో కాదని తీవ్రంగా విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ వాళ్లపైన కేసులు పెట్టిన వ్యక్తి అని చెప్పారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా కోడెల బిడ్డగా సత్తెనపల్లిలో పనిచేస్తున్నానని, సత్తెనపల్లిలో చేసిన అభివృద్ధిని ప్రజలందరూ చూశారని చెప్పారు. ఎన్టీఆర్ ఆశయాలతో కోడెల శివప్రసాదరావు ఆశీస్సులతో నియోజకవర్గంలో పనిచేస్తున్నానని, తమకు అధికారం కొత్తేమి కాదని, అధికారాన్ని ఎప్పుడో చూశామన్నారు. కోడెల కుమారుడిగా పుట్టడమే తన అదృష్టమని చెప్పారు. పదవుల కోసం పార్టీలు మారే వ్యక్తులు వేరే ఉంటారని వ్యాఖ్యానించారు. కోడెల శివరామ్ వ్యాఖ్యలపై ఆ పార్టీలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

నూతన రైస్ కార్డులు పంపిణీ

సత్తెనపల్లి: దారిద్ర్య రేఖకు దిగువనున్న అర్హులైన నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం రైస్ కార్డులు మంజూరు చేయడం అభినందనీయమని 19వ వార్డు కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో నూతనంగా మంజూరైన రైస్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సచివాలయ అడ్మిన్ గంటా శ్రీనివాస రావు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

శ్రీవారికి శ్రీ పద్మపీఠ అలంకరణ

సత్తెనపల్లి: ధనుర్మాసం పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి రామాలయం వేంకటేశ్వర స్వామి దేవాలయం, రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం, ఐదులాంతర్ల సెంటర్‌లోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయం, కట్టమూరివారి వీధిలోని కోదండ రామాలయంలో బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రైల్వేస్టేషన్‌రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి శ్రీ పద్మపీఠ వేంకట రంగనాథ అలంకారం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

పోస్ట్ ఆపరేటివ్ వార్డు అభివృద్ధికి రూ.3 లక్షలు మంజూరు

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో ప్రతి నెలా 170 నుంచి 200 గర్భిణుల ప్రసవాలు జరుగుతున్న నేపథ్యంలో గర్భిణులకు సంబంధించిన పోస్ట్ ఆపరేటివ్ వార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఏపీ ఎమ్మెస్ ఐడీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్‌ను ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ బుధవారం కలిసి కోరారు. గర్భిణుల వార్డును రెన్యూవేషన్ చేసి ఏసీలు బిగించి ఐసీయూ సెటప్ చేయాల్సి ఉండటంతో ఏపీ ఎమ్మెస్ ఐడీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ రూ. 3 లక్షలు మంజూరు చేసినట్లు కొత్త రామకృష్ణ తెలిపారు. దీనివల్ల గర్భిణులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుతుందని రామకృష్ణ తెలిపారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గ సమావేశం

క్రోసూరు: మండలంలోని పెరికపాడు గ్రామంలో బుధవారం నూతన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, ఎమ్మెస్ఎఫ్ విభాగాల నూతన కమిటీల ఏర్పాటు, కమిటీల బలోపేతం చేయడం గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నందిగం దేవదాసు మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం సాధించిన ఫలితాలు, వర్గీకరణ ఉపయోగాలు విద్యార్థులకు తెలియజేయడం జరిగిందన్నారు. ఆ శాఖ మండల అధ్యక్షుడు కొడవటి కృపరావు మాదిగ మాట్లాడుతూ మాదిగల హక్కుల కోసం పోరాటం చేయటం మన బాధ్యత అని అన్నారు. నాయకులు జడ సుబ్బుమాదిగ, రేపూడి ప్రభుదాసు మాదిగ, సిద్దెల దిలీప్ కుమార్ మాదిగ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఫ్ఏ కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియో

నకరికల్లు: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవడం ద్వారా కుటుంబానికి రక్షణగా నిలిచిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని చీమలమర్రి గ్రామానికి చెందిన ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పాటిబండ్ల శివ ఇటీవల మృతి చెందాడు. మృతుని భార్య శ్రావణికి ఉపాధి హామీ శాఖ ద్వారా మంజూరైన రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియోను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పెద్దను కోల్పోవడం ఆ కుటుంబానికి తీరనిలోటన్నారు. బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో తక్షణమే మంజూరయ్యేలా కృషిచేసిన అధికారులను అభినందించారు. ఎన్ఆర్ఈజీఎస్ పీడీ జోసఫ్‌కుమార్, ఎంపీడీఓ బండి శ్రీనివాస రెడ్డి, ఏపీడీ నారాయణ, ఏపీఓ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ఠంఛనుగా పింఛన్లు

- ఇచ్చినమాట ప్రకారం పింఛన్ పెంచి ఇస్తున్న సీఎం వైఎస్ జగన్
- కుల, మత, పార్టీలకతీతంగా పథకాలు
- లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీలో మంత్రి అంబటి రాంబాబు


రాజుపాలెం మండల పరిషత్ కార్యాలయంలో నూతన పింఛన్లు అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: కులాలు, మతాలు, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్ అందజేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కొనియాడారు. మండల పరిషత్ కార్యాలయంలో పెంచిన వైఎస్సార్ పింఛన్‌లను లబ్ధిదారులకు మంత్రి అంబటి రాంబాబు బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి పార్టీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అంబటి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పింఛన్‌లు మంజూరు కావాలంటే ఆ గ్రామంలో ఎవరో ఒకరు మరణించితేనే తరువాత వారికి పింఛన్ అందేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. జగనన్న ప్రభుత్వం పింఛను వయస్సును 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు కుదించడం వలన ఎక్కువ మంది వృద్ధులు పింఛన్ పొందుతున్నారని, వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా వలంటీరు ఇంటికి వచ్చి 1వ తారీకునే పింఛన్ అందజేస్తున్నట్లు వివరించారు. మండలం మొత్తం 107 కొత్త పింఛన్లు మంజూరు అయ్యాయని, ఇంకా రావాల్సి ఉన్నాయని, త్వరలో వస్తాయని తెలిపారు. ఇలాగే అభివృద్ధి, సంక్షేమం భవిష్యత్తులోనూ కొనసాగాలంటే జగనన్నను సీఎంగా మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బాసు లింగారెడ్డి, పక్కాల సూరిబాబు, తోట మోహన్‌రావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొండ్రెడ్డి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలి..

బెల్లంకొండ: మంచి చేసే ప్రభుత్వానికి ప్రతిఒక్కరూ అండగా నిలవాలని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పలు గ్రామాలలో నూతనంగా మంజూరైన పింఛన్లతో పాటుగా, రూ.3వేలకు పెంచిన పింఛన్లను పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ అహ్మద్ పాషా, చింతారెడ్డి సాయిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ గాదె మిల్లు వెంకటరెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ దరియా, సిరిపురం మేస్త్రి, మహ్మద్ షరీఫ్, మౌలాలి, బడాబచ్చా, కార్యదర్శి గిరిరెడ్డి పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ ..


నూతనంగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు విజయప్రతాప్‌రెడ్డి

అచ్చంపేట: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని జడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెరుకుపాలెంలో బుధవారం రాత్రి ఆయన నూతనంగా మంజూరైన పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ప్రస్తుతం 410 పెన్షన్లు ఉండగా మరో 12 మందికి నూతనంగా మంజూరైనట్లు చెప్పారు. వారిలో దివ్యాంగులు 6, వృద్ధులు 4, వైధవ్య పెన్షన్లు 2 ఉన్నట్లు చెప్పారు. వారందరికి ఒక్కొక్కరిగా రూ.3వేలు చొప్పున పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ చింతగుంట్ల హనుమంతరెడ్డి, ఎంపీటీసీ సీతమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెన్నా శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు గొటిక శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

మహనీయుడు బాబాసాహెబ్ అంబేడ్కర్

అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభ పోస్టర్లు ఆవిష్కరించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: ఈనెల 19వ తేదీన భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవానికి నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. క్రోసూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభ పోస్టర్లను ఎమ్మెల్యే బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాలకు సామాజిక న్యాయాన్ని అందించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలక జైపాల్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గార్లపాటి దాసు, లిడ్ క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, వైఎస్సార్ సీపీ క్రోసూరు మండల అధ్యక్షుడు పెరుమాళ్ళపల్లి కోటయ్య, పార్టీ క్రోసూరు, అచ్చంపేట మండలాల కన్వీనర్లు వెలది అప్పారావు, చిలక చంద్రయ్య, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మ ప్రతాప్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, ఎంపీటీసీ చిలకా ప్రసన్న రవికుమార్, చావల శ్రీనివాసరావు, చిలక మనోహర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

భారతరత్న బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడు ..


సత్తెనపల్లి 9వ సచివాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

సత్తెనపల్లి: ప్రతి భారతీయుడి గుండెల్లో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెరగని ముద్ర వేశారని, ఆయన చిరస్మరణీయుడని వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు, 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ ఆదేశాల మేరకు మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు ఆధ్వర్యంలో పట్టణంలోని 9వ సచివాలయంలో బుధవారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్యుత శివప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ జీవిత చరిత్ర, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి, ధృఢమైన రాజ్యాంగాన్ని అందించడంలో ఆయన సేవలు నిత్య స్మరణీయమన్నారు. విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19న ఆవిష్కరించనున్న నేపథ్యంలో అంబేడ్కర్ స్ఫూర్తిని చాటేలా కార్యక్రమాలను నిర్వహించడం సంతోషకరమన్నారు. 23వ వార్డు కౌన్సిలర్ ఆకుల రమేష్ మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ గొప్ప మేధావి అంబేడ్కర్ అన్నారు. ఆయన్ను స్మరిస్తూ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడాన్ని తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అందరితో ప్రతిజ్ఞ చేయించి, ఫ్లెక్సీ బ్యానర్ పై అందరూ సంతకాలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు అష్రఫ్ అలీ, ఆనంద భరత్, కరిముల్లా, నళిని, జయలక్ష్మి, వలంటీర్లు రోజా, నవీన, రంజాన్, సుజాత, చంద్ర, తేజ, తదితరులు ఉన్నారు.


అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, నాయకులు

సాంప్రదాయ పండుగలను గౌరవిద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి

అచ్చంపేట, పెదకూరపాడు, బెల్లంకొండ: సాంప్రదాయంగా వచ్చే పండుగలలో సంక్రాంతి ముఖ్యమైనదని, అలాంటి పండుగలు కనుమరుగవ్వకుండా కాపాడుకోవాలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంత కుమారి అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూలులో బుధవారం ఆమె వైఎస్సార్ క్రాంతిపథం సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా నియోజకవర్గంలోని ఐదు మండలాలలో ఈనెల 11,12, 13 తేదీలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 11వ తేదీన అమరావతి, పెదకూరపాడు, 12న అచ్చంపేట, 13న బెల్లంకొండ, క్రోసూరు మండలాలలో నిర్వహించనున్నామన్నారు. ప్రతి మండలం నుంచి 500మంది మహిళలకు తగ్గకుండా పాల్గొనేవిధంగా చూడాలన్నారు. ప్రతి మండలంలో మొదటి బహుమతి రూ.40వేలు, ద్వితీయం రూ.25వేలు, తృతీయ రూ.15వేలు, నాల్గో బహుమతి రూ.10వేలు, ఐదో బహుమతి రూ.5వేలు ఇస్తామన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతి ఉంటుందన్నారు. అదేవిధంగా బెల్లంకొండ, పెదకూరపాడు మండల కేంద్రాల్లో పోటీలు ఏర్పాటు చేయనున్న మైదానాలను ఎమ్మెల్యే సతీమణి పరిశీలించారు. కార్యక్రమాల్లో ఆయా మండలాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు


ధరణికోట, ఉంగుటూరు జట్ల మధ్య జరుగుతున్న వాలీబాల్ మ్యాచ్

అమరావతి: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బుధవారం వాలీబాల్, షటిల్ బాడ్మింటన్, కబడ్డీ, క్రికెట్ పోటీలను నిర్వహించారు. డిసెంబరు 26వతేదీ నుంచి గ్రామస్థాయిలో నిర్వహించిన ఆటలపోటీలలో విజేతలకు మండల స్థాయిలో పోటీలు జరుగుతున్నాయి. తొలిరోజు అత్తలూరు, జూపూడి, లింగాపురం, ధరణికోట, ఉంగుటూరు, మల్లాది జట్లకు పోటీలు స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్, ప్లేగ్రౌండ్‌లో పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ గంగాధర శ్రీనివాస్ మాట్లాడుతూ బుధవారం నుంచి 23 వరకు మండలస్థాయి పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటిస్తామన్నారు. ఈ పోటీలలో పలు గ్రామాల క్రీడాకారులు, సచివాలయాల సిబ్బంది, పీఈటీలు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట: గ్రామీణ ప్రాంతాలలో ప్రతిభఉండి ప్రోత్సాహం లేక మరుగున పడిన క్రీడాకారులను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఆడుదాం..ఆంధ్రా క్రీడాపోటీలు నిర్వహిస్తోందని ఇన్‌చార్జి ఎంపీడీఓ స్వరూపారాణి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు గ్రౌండ్‌లో బుధవారం ఆమె మండల స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వేల్పూరు–పెదపాలెం జట్ల మధ్య జరిగిన పురుషుల క్రికెట్ పోటీలలో వేల్పూరు జట్టు, చింతపల్లి–అచ్చంపేట–2 జట్లమధ్య జరిగిన పోటీలలో అచ్చంపేట–2 జట్టు, కోగంటివారిపాలెం–గ్రంథశిరి జట్ల మధ్య జరిగిన పోటీలో కోగంటివారిపాలెం జట్టు, చల్లగరిగ–కొత్తపల్లి జట్ల మధ్య జరిగిన పోటీలో చల్లగరిగ జట్టు విజయం సాధించాయి. పోటీలు గురు, శుక్రవారాలలో కూడా జరగనున్నట్లు హైస్కూలు పీడీ ఆలపాటి సుజాత తెలిపారు.

ఆడుదాం ఆంధ్రా కిట్లు పంపిణీ

సత్తెనపల్లి: క్రీడాకారులు క్రీడా ప్రతిభను ప్రదర్శించాలని వైఎస్సార్ సీపీ 7వ వార్డు ఇన్‌చార్జ్ దేవరశెట్టి రవికుమార్ అన్నారు. పట్టణంలోని 7,8 వార్డులకు కలిపి 7వ సచివాలయంలో బుధవారం క్రీడాకారులకు 'ఆడుదాం ఆంధ్రా'లో భాగంగా క్రీడా సామగ్రి కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను నిర్వహిస్తుందన్నారు. ప్రతి క్రీడాకారుడు పోటీ తత్వంతో ప్రతిభను ప్రదర్శించాలన్నారు. మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు రేపూడి రవితేజ, చంటి, క్రీడాకారులు ఉన్నారు.

గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం..

పెదకూరపాడు: ఆడుదాం ఆంధ్రాతో గ్రామీణ క్రీడలకు ఏంతో ప్రోత్సహం లభించిందని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అన్నారు. పెదకూరపాడు మండలం పెదకూరపాడు జెడ్పీ పాఠశాల, గారపాడు జెడ్పీ పాఠశాలలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి క్రీడ పోటీలను ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, వైఎస్ ఎంపీపీ షేక్ భాష,మండలవైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు షేక్ మస్తాన్ షరీఫ్‌లు ప్రారంభించారు. మండల ప్రత్యేకాధికారి ధనలక్ష్మి, షేక్ మాబు, ఎంపీడీఓ నరసింహారావు, పీఈటీలు నాగరాజు, అరుణ, ఎంఈఓలు ప్రసాదరావు, సత్యనారయణలు పాల్గోన్నారు.

క్రోసూరు: క్రోసూరు జెడ్పీపాఠశాలలో ఆవరణలో మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఖోఖో, వాలీబాల్, క్రికెట్ పోటీలు జరిగాయి. మండలంలో 15 సచివాలయాల నుంచి ప్రతి ఆటకు రెండు జట్లు చొప్పున 150 జట్లు క్రీడల్లో పాల్గొన్నాయని ఎంపీడీఓ బి.మహేష్ తెలిపారు. ఎంపీపీ పి.కోటయ్య, జడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటిదాసు, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, మండల అధ్యక్షుడు వెలది అప్పారావు తదితరులు సందర్శించారు.

రాజుపాలెం: మండలకేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి ఆటల పోటీలను మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళిలు బుధవారం ప్రారంభించారు. పాఠశాల ఫాదర్ ఇన్నారెడ్డి, జీడీసీఎంసీ డైరెక్టర పాలవాయి ఆదినారాయణ, అనుపాలెం సర్పంచ్ సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, ఎంఈవో మల్లిఖార్జునశర్మ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి..

సత్తెనపల్లి: క్రమం తప్పకుండా తర్ఫీదు పొంది మెలకువలు తెలుసుకొని క్రీడల్లో రాణించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు బండి మల్లిఖార్జునరెడ్డి అన్నారు. పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల్లో భాగంగా 13వ సచివాలయం పరిధిలోని వడవల్లి ఏరియా, 10వ సచివాలయం పరిధిలోని వెంకటపతి నగర్ మధ్య క్రికెట్ పోటీలలో బుధవారం నిర్వహించారు. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో 13వ సచివాలయం వడ్డవెల్లి ఏరియా క్రికెట్ టీం విజయం సాధించింది. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆయన అభినందించి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గడ్డం వెంకటేశ్వర్లు(బుల్లోడు), మున్సిపల్ మేనేజర్ ఎస్. సాంబశివరావు, సచివాలయ ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ముప్పాళ్ళ: మండల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ మారూరి పద్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ మారూరి పద్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నీ అర్హులకు అందేలా చూడాలన్నారు.

ఎటువంటి రాజకీయాలకు తావులేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, గ్రామస్థాయిలో అధికారులు కూడా బాధ్యతగా పనిచేయాలన్నారు. బొల్లవరం ఎంపీటీసీ కళ్ళం వీరభాస్కరరెడ్డి, తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్‌లు మాట్లాడారు. ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి, ఎంఈఓ ఒంగోలు రాజు, పీహెచ్‌సీ వైద్యుడు జయకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మీ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా రవికాంత్‌రెడ్డి



క్రోసూరు: రాష్ట్రీయ ఉపాధ్యాయ సంఘం క్రోసూరు మండల నూతన కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో మండల నూతన అధ్యక్షుడిగా ఎం.రవికాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాజలి రాంబాబు, ఆర్థిక కార్యదర్శిగా కర్ర రవికుమార్, గౌరవ అధ్యక్షుడిగా చెరుకూరి శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికల పరిశీలకులుగా కాకర్ల గంగాధర్, ఎస్టీయూ కార్యకర్తలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సాతులు రాఘవ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలకు విశేష స్పందన


ముగ్గులను పరిశీలిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: గ్రామాలలో కనుమరుగవుతున్న సంప్రదాయాలను వెలికితీసేందుకే గత ఐదేళ్ల నుంచి వైఎస్సార్ సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి ముగ్గుల పోటీలను బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి ముగ్గుల పోటీలలో మహిళలను ప్రోత్సహించేందుకు గ్రామాలలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని, అనంతరం మండల స్థాయిలోను, నియోజకవర్గ స్థాయిలోను నిర్వహించి నగదు బహుమతులను అందిస్తామని అన్నారు. ఈ పోటీలలో మహిళలనుంచి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. ముగ్గులను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఐదుగురు విజేతలను ప్రకటించారు. మొదటి బహుమతి బీరవల్లిపాయకు చెందిన సౌజన్య(రూ.25వేలు), ద్వితీయ బహుమతి అంచులవారిపాలెం వీరకుమారి(రూ.15వేలు), తృతీయ బహుమతి గణపవరంకు చెందిన అలేఖ్య(రూ.10వేలు), నాల్గో బహుమతి అనుపాలెంకు చెందిన వెంకాయమ్మ(రూ.5వేలు), ఐదవ బహుమతి పెద నెమలిపురికి చెందిన ధనలక్ష్మి(కన్సోలేషన్)లకు నగదు బహుమతులను రాష్ట్ర మంత్రి అంబటి అందజేశారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హసంతి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బాసు లింగారెడ్డి, పక్కాల సూరిబాబు, తోట మోహన్‌రావు, మర్రి సుబ్బారెడ్డి, కొండ్రెడ్డి సుజాత, తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా ముగ్గుల పోటీలు..

పెదకూరపాడు: స్థానిక కాకతీయ విద్యా సంస్థలు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల నిర్వాహకులు శీలంనేని సాంబశివరావు, ఇందిరాదేవీ, లలితబాబులు మాట్లాడూతు సంక్రాంతి సందర్భంగా ముగ్గులు పోటీల్లో పెద్ద సంఖ్యలో పాల్గోని ముగ్గులు వేయడం ఏంతో సంతోషంగా ఉందన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

సత్తెనపల్లి: పట్టణంలోని 31వ వార్డుకు చెందిన ఆకుల శివశంకర్ వైఎస్సార్ సీపీలో చేరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆకుల శివశంకర్‌కు బుధవారం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖా మంత్రి అంబటి రాంబాబు స్వయంగా పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఇటీవల వైఎస్సార్ సీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన ఆకుల హనుమంతరావుకు శివశంకర్ స్వయానా సోదరుడు కావడం విశేషం. వైఎస్సార్ సీపీలో హనుమంతరావుకు సముచిత స్థానం కల్పించినా పార్టీ వీడి వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ స్థానిక నాయకులతో కలిసి సమన్వయం చేసుకొని ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, బాసులింగారెడ్డి, ఆకుల శివయ్య, తోట లక్ష్మీ నారాయణ, తదితరులు ఉన్నారు.

విద్యుత్ విజిలెన్స్ విస్తృత తనిఖీలు


ముప్పాళ్ల సబ్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న విజిలెన్స్ అధికారులు

ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్‌శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించి 141 మంది నుంచి రూ.7.63లక్షల అపరాధ రుసుం విధించినట్లు డీపీఈ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.సూర్యప్రకాష్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావులు బుధవారం తెలిపారు. మొత్తం 45 మంది అధికారులు, 135 మంది సిబ్బంది, 45 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించామన్నారు. మొత్తం 2,658 సర్వీసులు తనిఖీ చేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 141 మందికి రూ.7.63లక్షల అపరాధ రుసుం విధించటం జరిగిందన్నారు. మీటర్ లేకుండా డైరెక్ట్‌గా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 13 మందికి రూ 17వేలు, మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 8 మందికి రూ.1.63లక్షలు, అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న ఒకరికి రూ. 27వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 119 మందికి రూ.5.56లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు నిబంధనలు ప్రకారమే విద్యుత్‌ను వినియోగించాలని సూచించారు. అపరాధ రుసుము కట్టలేని పరిస్థితుల్లో రెవెన్యూ రికవరీ చట్టం ఉపయోగించి ఆస్తులు జప్తు చేయటం జరుగుతుందన్నారు. ఈ దాడులలో డీఈఈలు కె.రవికుమార్, ఎం.రవికుమార్, టి.శ్రీనివాసరావు, ఏఈఈ కె.కోటేశ్వరరావు, ఎ.చంద్రశేఖర్, పి.రవికిరణ్, ఏఈఈలు పాల్గొన్నారు.

అమరావతి మండలంలో..

అమరావతి: మండల పరిధిలోని అన్ని గ్రామాలలో విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ వినియోదారుల కనెక్షన్‌లను బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో సీఆర్‌డీఏ ఎస్ఈ పి.విజయకుమార్ ఆధ్వర్యంలో 82మంది అధికారులు 41బృందాలుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మండల విద్యుత్ శాఖ ఏఈ అశోక్‌కుమార్ మాట్లాడుతూ తనిఖీలలో 105 సర్వీసులకు ఆదనపులోడు కింద రూ.6,40,000 అపరాధ రుసుము విధించామన్నారు. ఈ తనిఖీలలో ఈఈ తులసీరామ్, విజిలెన్స్ ఈఈ శ్రీనివాసమూర్తి, డీఈఈ కేవీ కోటేశ్వరరావు, ఎల్ఐ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.